

హుండీ కానుకల లెక్కింపు

కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయ హుండీ కానులకను శనివారం లెక్కించారు. - 8లో



కారు-ఆటో ఢీకొని..

బంగారుపాళెం మండలంలోని చెన్నై-బెంగళూరు హైవేలో ఆటోను ఓ కారు ఢీకొట్టడంతో 10 మంది గాయపడ్డారు. - 8లో



బాధిత కుటుంబాలకు పరామర్శ

జీడీనెల్లూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు మాజీ డిప్యూటీ సీఎం అండగా నిలుస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఏఎస్పీల బదిలీ

చిత్తూరు అర్బన్‌: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అదనపు ఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. తిరుపతి ఏఎస్పీ జె.కులశేఖర్‌ను విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు, చిత్తూరు ఏఎస్పీ ఆరీఫుల్లాకు ఎక్కడా పోస్టింగ్‌ ఇవ్వకుండా పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. చిత్తూరు స్పెషల్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరో (ఎస్‌ఈబీ) ఏఎస్పీ ఏవీ.సుబ్బరాజును తూర్పుగోదావరి ఏఎస్పీగా నియమించింది. పుట్టపర్తి ఎస్‌ఈబీలో ఉన్న బీ.నాగభూషణరావును తిరుపతి ఏఎస్పీగా నియమించగా.. చిత్తూరుకు ఇంకా ఎవర్నీ నియమించలేదు.

సీఐల బదిలీ

చిత్తూరు అర్బన్‌: చిత్తూరు, తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్‌ డీఐజీ కోయ ప్రవీణ్‌ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు వీఆర్‌లో ఉన్న ఎస్‌.విశ్వనాథరెడ్డిని రాయచోటి ట్రాఫిక్‌కు, ఐ.రవిశంకర్‌రెడ్డిని అన్నమయ్య దిశాకు, తిరుపతి వీఆర్‌లో ఉన్న బి.రాఘవరెడ్డిని అన్నమయ్య ఎర్రచందనం స్మగ్లింగ్‌ నిరోధక విభాగం, కుప్పంలో పని చేసి చిత్తూరు సీసీఎస్‌కు వచ్చిన టి.శ్రీధర్‌కు ఆ పోస్టింగ్‌ను రద్దు చేస్తూ వీఆర్‌కు ఆదేశించారు.

20న వెరిఫికేషన్‌

చిత్తూరు కలెక్టరేట్‌ : ఉద్యోగోన్నతుల వెరిఫికేషన్‌కు సంబంధిత సర్టిఫికెట్, సర్వీసు పుస్తకంతో ఈ నెల 20న డీఈఓ కార్యాలయానికి హాజరు కావాలని డీఈఓ దేవరాజు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీలకు స్కూల్‌ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పించడం జరుగుతుందన్నారు. స్కూల్‌ అసిస్టెంట్‌ తెలుగు, హిందీ పండిట్‌ ఉద్యోగోన్నతులకు 2017 అక్టోబర్‌ 10వ తేదీకి గల ఖాళీల సీనియారిటీ జాబితాను సిద్ధం చేయడం జరిగిందన్నారు. అర్హత ఉన్నవారు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని డీఈఓ ఆదేశించారు.

కోర్టు భవనాల పరిశీలన



పుంగనూరు: న్యాయవాదులతో సమావేశమైన జిల్లా జడ్జి భీమారావు

పుంగనూరు: చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు శనివారం రాత్రి పుంగనూరు కోర్టు భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు ఆకుల చెన్నకేశవుల ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా జడ్జికి ఘన స్వాగతం పలికారు. సిబ్బంది, న్యాయవాదులతో ఆయన సమీక్షించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పుంగనూరు కోర్టులకు న్యాయమూర్తుల నియామకంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మలేరియా నిర్మూలనే లక్ష్యం



పీహెచ్‌సీ వైద్యులతో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి అనిల్‌ కుమార్‌

గంగాధరనెల్లూరు: మలేరియా నిర్మూలనే లక్ష్యంగా వైద్యులు, సిబ్బంది పనిచేయాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్‌ అనిల్‌ కుమార్‌ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా మలేరియా అధికారి డా.అనిల్‌ కుమార్‌ మండలంలో మలేరియా కేసులు, వ్యాధి నిర్మూలనపై వైద్యులతో చర్చించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమ కాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రిలో పలు రికార్డులను , ల్యాబొరేటరీని పరిశీలించారు. అనంతరం ముక్కలుతూరు గ్రామంలో ప్రతి ఇంటి వద్దకు వెళ్లి మలేరియా వ్యాప్తి చెందకుండా సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్‌ దుర్గాదేవి, సీహెచ్‌ఓ, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్‌ శిలాతోరణం వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 62,625 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 34,462 మంది తలనీలాలు, హుండీలో రూ.3.63 కోట్లు కానుకలను భక్తులు అందించారు. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. అంతకన్నా ముందు వెళ్లిన వారిని లోనికి అనుమతించబోమని పేర్కొంది.

ఆగ్రహ జ్వాల

కోల్‌కతాలో ట్రైనీ మహిళా డాక్టర్‌ హత్యాచారం ఘటనపై యావత్‌ భారతావని ఆగ్రహజ్వాలలు రగలిస్తోంది. "విధుల్లో ఉన్న డాక్టర్‌ను అత్యంత అమానవీయంగా హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి. ప్రాణం పోసే డాక్టర్లనే చంపేస్తారా ? దేశంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు రూపొందించాలి" అంటూ జిల్లావ్యాప్తంగా డాక్టర్లు నినదించారు. వైద్యసేవలకు విరామం ప్రకటించి రోడ్లెక్కారు. న్యాయం జరిగే పోరాటం ఆపమని హెచ్చరించారు.





చిత్తూరు నగరంలోని గాంధీ విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించిన వైద్యులు, వైద్య విద్యార్థులు

- కోల్‌కతాలో మహిళా ట్రైనీ డాక్టర్‌ హత్యాచార ఘటనపై భగ్గుమన్న వైద్యరంగం
- ధర్నాలు, నిరసనలతో అట్టుడికిన జిల్లా
- జిల్లా ఆస్పత్రిలో ఓపీ సేవలు నిలిపివేత
- నిందితులను శిక్షించేవరకు పోరాటం ఆపమని హెచ్చరిక

కాణిపాకం: జిల్లావ్యాప్తంగా వైద్యరంగంలోని డాక్టర్లు, వైద్యసిబ్బంది భగ్గుమన్నారు. కోల్‌కతాలోని ఆస్పత్రిలో ఉన్న మహిళా డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనను యావత్‌ వైద్యరంగం ఖండించారు. ప్రాణం పోసే డాక్టర్లనే చంపేస్తారా అని ప్రశ్నించారు. కోల్‌కతాలో మహిళా ట్రైనీ డాక్టర్‌ను హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ముక్తకంఠంతో నినదించారు. శనివారం జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు నిరసనలు, ర్యాలీలు, ధర్నాలతో రోడెక్కారు. దీంతో పలు ఆస్పత్రుల్లో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

హోరెత్తిన నిరసనలు

చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, పీజీ డాక్టర్లు సుమారు 300మందికి పైగా విధులను బహిష్కరించి నిరసన చేశారు. అలాగే ప్రైవేటు ఆస్పత్రుల్లోని డాక్టర్లు సైతం రోడ్డుపైకి వచ్చారు. జిల్లా ఆస్పత్రిలో శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఓపీ సేవలు నిలిపివేశారు. శస్త్ర చికిత్సలను కూడా వాయిదా వేశారు. పీజీ విద్యార్థులు చేపడుతున్న దీక్ష మూడో రోజుకు చేరుకుంది. వీరికి పలు స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌ మద్దతు పలికారు. పలమనేరు ఏరియా ఆస్పత్రి సూపరిటెండెంట్‌ మమతారాణితో పాటు పలువురు సిబ్బంది ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పుంగనూరు, జీడీనెల్లూరు, నగరి, కుప్పం, పూతలపట్టులోని వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కోల్‌కతాలో వైద్య విద్యార్థిని కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ నిరసన కొనసాగుతుందని తేల్చి చెప్పారు. సాయంత్రం కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. స్పెషల్‌ ప్రొటెక్షన్‌ ఫోర్స్‌ ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.



చిత్తూరులో పీజీ వైద్య విద్యార్థులకు డాక్టర్ల సంఘీభావం



రొంపిచెర్ల పీహెచ్‌సీ వద్ద మౌనం పాటిస్తున్న వైద్య సిబ్బంది



చిత్తూరు నగరంలో నిరసన ర్యాలీ చేస్తున్న వైద్యులు, పీజీ వైద్యులు

వైద్యుల ఘోషను పట్టించుకోరా..?



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఖాళీగా ఓపీ విభాగం

చిత్తూరు రూరల్‌ (కాణిపాకం): వైద్యుల ఘోషను పట్టించుకోరా అంటూ ఐఎంఏ శాఖ అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, కార్యదర్శి నారాయణరెడ్డి, అపోలో నిర్వాహకులు నరేష్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. కోల్‌కతాలో ట్రైనీ మహిళా వైద్యురాలి హత్యకు నిరసనగా ఐఎంఏశాఖ ఇచ్చిన పిలుపుమేరకు చిత్తూరు నగరంలో శనివారం పీజీడాక్టర్లు, ప్రభుత్వ, ప్రైవేటు డాక్టర్లు బంద్‌ చేపట్టారు. వారు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి నినాదాలు చేస్తూ..ర్యాలీగా గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. ట్రైనీ మహిళా వైద్యురాలికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎంఏ శాఖ సభ్యులు, ప్రభుత్వ వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

యాడ్‌-ఆన్‌ కోర్సులు ప్రారంభం

కుప్పంరూరల్‌: కుప్పం పాలిటెక్నిక్‌ కళాశాలలో త్వరలో ఆడ్‌ ఆన్‌ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ డా.జగన్నాథరావు శనివారం తెలిపారు. ఈ కోర్సుల్లో ఇంటర్నెట్‌ ఆఫ్‌ థింగ్స్‌ (ఐవోటీ), సాలిడ్‌ ఎడ్జ్‌ తదితర ఆధునిక సాంకేతికతతో కూడిన కోర్సులను అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. ఇంజినీరింగ్, డిప్లొమా పూర్తి చేసుకున్న విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు ఈ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోర్సులు 90 గంటలు మాత్రమే ఉంటాయని, కేవలం రూ.1500 నామమాత్రపు ఫీజుకే బోధించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా డేటా ఎంట్రీ ఆపరేటర్, వెబ్‌ డెవలప్‌మెంట్, ట్రైనీ బ్యూటీషియన్‌ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ కోర్సులకు 18–35 ఏళ్ల వయసు కలిగి ఇంటర్‌ పాస్‌/ఫెయిల్‌ అయిన వారు అర్హులన్నారు. ఈ మూడు కోర్సులు ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు 25వ తేదీలోపు స్కిల్‌ డెవలప్‌మెంట్‌ కో ఆర్డినేటర్‌ 9052507933 నంబరులో సంప్రదించాలని కోరారు.

అదనపు వసతులకు వినతి...

అదేవిధంగా కళాశాలకు అవసరమైన వసతుల కోసం కడా పీడీకి ప్రతిపాదనలు పంపినట్లు ప్రిన్సిపాల్‌ జగన్నాథరావు చెప్పారు. కళాశాలకు అదనపు తరగతి గదులు, ల్యాబ్‌ పరికరాలు, కాంపౌండ్‌ వాల్, హాస్టల్‌ గదులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్‌ జగన్నాథరావు

పేదరిక నిర్మూలనే ధ్యేయం

- జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి
- కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌ గాంధీ



మాట్లాడుతున్న కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్‌ : వికసిత్‌ ఆంధ్ర–2047 అమల్లో భాగంగా జిల్లా అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికలు అమలు చేయాలని కలెక్టర్‌ సుమిత్‌ కుమార్‌ గాంధీ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 12 అంశాల ప్రాతిపదికన ప్రణాళికను రూపొందించాలన్నారు. జిల్లాస్థాయిలో వ్యవసాయ అనుబంధ రంగాల్లో రైతులకు లాభసాటి చేసే అంశాలు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యత, టూరిజం, ఎకో టూరిజం.. ఇలా ప్రతి రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రతి కుటుంబాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు పేదరికాన్ని తగ్గించే అవకాశం ఉందని, అవి పేదలందరికీ అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్‌ హిమవంశీ, డ్వామా పీడీ రాజశేఖర్, ఇతర శాఖల అధికారులు చంద్రశేఖర్, ఉమామహేశ్వరరెడ్డి, విజయకుమార్, సాంబశివారెడ్డి, మురళీకృష్ణ, దేవరాజులు, వెంకటరమణారెడ్డి, తులసి, గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు చేపట్టండి..

కలెక్టరేట్‌ ప్రాంగణంలో సుందరీకరణ పనులు చేపట్టాలని కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌ గాంధీ అన్నారు. శనివారం ఆయన కలెక్టరేట్‌ ప్రాంగణంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్‌ ప్రాంగణంలోని వివేకానంద భవన్, జ్యోతిరావుపూలే భవన్, అంబేడ్కర్‌ భవనం వద్ద ఖాళీ స్థలంలో మొక్కలను విరివిగా నాటించాలని హార్టికల్చర్‌ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హార్టికల్చర్‌ డీడీ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు భద్రమేనా..?



శిథిలావస్థకు చేరిన రికార్డు గది

ఇటీవల మదనపల్లె ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదంలో రైతుల భూములకు సంబంధించిన వివరాలు ఉన్న గదిలో దాచిన రికార్డులు కాలిపోయాయి. ముఖ్యంగా భూసేకరణ, ఆస్తిపత్రాలు, విలువైన రికార్డులు కాలిపోయాయి. ఈ ఘటన అనంతరం విద్యుత్‌ శాఖ అధికారులు జిల్లాకేంద్రంలోని రికార్డుల కార్యాలయంతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పరిస్థితులను పరిశీలించి నివేదిక అందజేశారు.

- జిల్లాకేంద్రంలో 135 ఏళ్ల కాలం నాటి భవనంలో రికార్డులు
- మదనపల్లె ఘటన అనంతరం క్షేత్రస్థాయిలో రికార్డు గదుల పరిశీలన
- ప్రమాదకర స్థితిలో కార్యాలయాలు ఉన్నట్లు తేల్చిన విద్యుత్‌ అధికారులు
- ఉన్నతాధికారులకు నివేదిక అందజేత

ప్రమాదంలో కార్యాలయాలు..

నగరంలోని అర్బన్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయంలోని పాతకాలం నాటి భవనంలో రికార్డులు ఉన్నాయి. కొత్త భవనం నుంచి పాత భవనానికి విద్యుత్‌ సరఫరా చేసే వైరు సక్రమంగా లేదని, వాటిని మార్చుకోక తప్పదని అధికారులు పరిశీలించి తెలిపారు. రికార్డురూమ్‌కు విద్యుత్‌ సరఫరా చేసే వైరు ప్రమాదకరంగా ఉందని వాటికి సరఫరా ఆపి వేయాలన్నారు. అదేవిధంగా రూరల్‌ కార్యాలయంలో కన్‌సీలింగ్‌ లేకుండా వైర్లు బయటే వేలాడుతూ ఉండడం ప్రమాదకరమని విద్యుత్‌ అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. రూరల్‌ కార్యాలయ అద్దెభవనాన్ని మార్చాల్సి ఉంది.



బ్రిటీషు కాలం నాటి భవనం

చిత్తూరు కార్పొరేషన్‌: మదనపల్లె సబ్‌కలెక్టర్‌ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాద ఘటన నేపథ్యంలో ప్రజల ఆస్తిపత్రాలు ఉండే సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయాలను తనిఖీ చేయాలని కలెక్టర్‌ ఆదేశాలు జారీ చేశారు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు నగరంలోని అర్బన్, రూరల్‌ కార్యాలయాలను పరిశీలించారు. అర్బన్‌ కార్యాలయంలోని రికార్డురూమ్‌ విద్యుత్‌ సరఫరా ఆపివేయాలని అలాగే వైర్‌ మార్చాలని, రూరల్‌ కార్యాలయంలో వైరింగ్‌ సరిగా లేదని ప్రమాదకరంగా ఉందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

1889 నాటి భవనం..

1889వ సంవత్సరంలో నిర్మించిన భవనంలోనే ప్రస్తుతం రికార్డులను ఉంచినట్లు అధికారులు చెబుతున్నారు. తొలుత అక్కడ సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయం, జిల్లా రిజిస్ట్రార్‌ కార్యాలయం, రికార్డు రూమ్‌ ఉండేవి. 2007లో చిత్తూరు రూరల్‌ కార్యాలయాన్ని ఓవర్‌బ్రిడ్జి కింద అద్దె భవనంలో ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతం రికార్డులు అక్కడికి తీసుకెళ్లారు. 2015లో పాత సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయం పక్కనే కొత్త భవనం నిర్మించారు. అక్కడే సబ్‌రిజిస్ట్రార్, డీఆర్, ఆడిట్‌ డీఆర్, డీఐజీ కార్యాలయాలు ఉన్నాయి. అక్కడికి కార్యాలయాన్ని మార్చు చేశాక, పాత భవనంలో రికార్డు రూం అలానే కొనసాగుతోంది.

మొత్తం 3334 వ్యాల్యూమ్స్‌..

భూతగాదాలు, ఆస్తి పంపకాల వివరాలు, తాతల కాలం నాటి వీలునామాలు దొరక్కపోతే అర్బన్‌ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాల్సిందే. 1993 నుంచి ఈసీ, సీసీల వివరాలు ఆన్‌లైన్‌ చేశారు. 0 తమిళనాడులో జిల్లా కలిసి ఉండడంతో ప్రస్తుతం పరదరామి ప్రాంత ఆస్తుల లావాదేవీల వివరాలు ఇక్కడ లభ్యమవుతున్నాయి. అప్పుడు చేతిరాత, దస్తావేజుల దస్తూరితో వ్యాల్యూమ్‌లో వివరాలు ఉండేవి. కొత్తగా వచ్చిన ఉద్యోగుల్లో చాలామందికి వాటిని చదవడం కూడా రాదు. జీడీనెల్లూరు, గిరింపేట, ఈచనేరి, ఇరువారం , కలవగుంట, కట్టమంచి, కోటాలం, కోణాపల్లె, కొండేపల్లె, కోటాగరం కోళ్లపల్లె, తాళంబేడు, తేంపల్లె, వసంతాపురం, తేనబండ, తవణంపల్లె, తిమ్మసముద్రం, ఉత్తరబ్రాహ్మణపల్లె, గుంటిపల్లె, సామిరెడ్డిపల్లె, అగరమంగళం, బసవపల్లె, బొమ్మసముద్రం, చీలాపల్లె, పట్రాంపల్లె, సిద్దారెడ్డిపల్లె, పుత్రమద్ది, 142 బండపల్లె, పాచిగుంట, దక్షిణపాతపాలెం, మాధవరం, చింతగుంట, చిత్తపార, కొట్రకోణ, నందనూరు, వరత్తూరు, పిరియంబాడి ఇలా 101 ప్రాంతాలకు సంబంధించి ఆస్తిపత్రాల వివరాలు 3334 వ్యాల్యూమ్స్‌ ఇక్కడ ఉన్నాయి.



మార్చే యోచనలో ఉన్నాం



చిత్తూరు అర్బన్‌ కార్యాలయ రికార్డు రూమ్‌ను మార్చాలనే ఉన్నాం. ప్రస్తుతానికి రికార్డు రూమ్‌లో విద్యుత్‌ వాడరాదని సంబంధిత అధికారులు తెలిపారు. ర్యాక్స్‌ను కట్‌ చేసి అందులో రికార్డులను భద్రపరచాలని చూస్తున్నాం. డీఐజీ కార్యాలయం పైఅంతస్తులోని గదిలోకి వాటిని మార్చాలనే యోచనలో ఉన్నాం.

– గిరిబాబు, డీఐజీ స్టాంప్స్‌ అండ్‌ రిజిస్ట్రేషన్‌ శాఖ

ఉద్యోగులకు సర్కారు ఝలక్

కూటమి సర్కారు ఉద్యోగులకు ఉన్నఫళంగా బదిలీల ఝలక్ ఇచ్చింది. 15 శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీలు చేయాల్సిందిగా శనివారం జీఓ నంబర్ 75ను రాష్ట్ర ప్రభుత్వం జారీచేసింది. అందులో బదిలీల ప్రక్రియలో చేపట్టాల్సిన నియమ, నిబంధనలను వెల్లడించింది. ఆ 15 శాఖల్లో ఉద్యోగుల విషయంలో నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని కోరింది. ఈ నెల 31వ తేదీలోపు బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించింది.

- 15 శాఖల్లో ఉద్యోగుల బదిలీలు
- ఐదేళ్లు ఒకేచోట ఉన్న వారిని మార్చాలని ఉత్తర్వులు
- ఒకే చోట ఉంటే వైఎస్సార్‌సీపీకి సానుకూలంగా ఉంటారన్న కుట్ర బుద్ధితో..
- ఉద్యోగులపై కూటమి సర్కారు కుట్ర
- ఈ నెల 31 లోపు బదిలీల కసరత్తు పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికలకు ముందు ఉద్యోగుల పట్ల కూటమి సర్కారు సానుకూలంగా ఉంటుందని ప్రచారాల్లో చంద్రబాబునాయుడు ప్రగల్భాలు పలికారు. అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు కూటమి సర్కారు బదిలీల ఝలక్ ఇచ్చింది. విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావొస్తుండగా, ఈ సమయంలో బదిలీలు ఇవ్వడం పనిష్మెంటేనని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగులను అదే స్థానంలో పెట్టకూడదన్న కుట్రతో బదిలీలకు తెరలేపారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఎన్నికలప్పుడేమో ఉద్యోగుల పట్ల సానుకూలంగా ఉంటామని చెప్పి, ఇప్పుడు ఇలా కుట్రలు చేయడం సబబుకాదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు ఒకేస్థానంలో ఉంటే వైఎస్సార్‌సీపీకి సానుకూలంగా పనిచేస్తారన్న కారణంగానే ఆకస్మిక బదిలీలకు కూటమి సర్కారు తెరలేపింది. దీంతో నమ్మినందుకు కూటమి సర్కారు నిండా ముంచేస్తోందని ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పుడు బదిలీలు తమ పిల్లల చదువులకు ఆటంకం కలుగుతుందని వాపోతున్నారు.

నిబంధనల ప్రకారం నిర్వహించాలి



నిబంధనల ప్రకారం బదిలీలు నిర్వహించాలి. ఉద్యోగులకు ఏ మాత్రం సమస్యలకు తావివ్వకూడదు. బదిలీల్లో రాజకీయ కక్షలు ఉండకూడదు. ఉద్యోగుల విధులను నిర్వహిస్తారు. బదిలీల్లో రాజకీయ ప్రమేయం లేకుండా నిర్వహించాలి. ఆయా శాఖల ఉద్యోగుల సమస్యలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా ప్రక్రియను చేపట్టాలి. – శివయ్య, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

15 శాఖల్లో వారికే స్థానచలనం..

జిల్లావ్యాప్తంగా 15 ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేయనున్నారు. ఈ నెల 19వ తేదీ నుంచి 31 వరకు ఉద్యోగుల బదిలీల ప్రక్రియను నిర్వహించనున్నారు. అంతవరకు బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు ఆదేశాలు జారీచేశారు. జిల్లావ్యాప్తంగా 31 మండలాల్లో ఉన్న రెవెన్యూ, పంచాయతీరాజ్, పురపాలక, గ్రామ,వార్డు సచివాలయాలు, మైన్స్, పౌరసరఫరాలు, అన్ని శాఖల్లో ఉన్న ఇంజినీరింగ్ ఉద్యోగులు, దేవదాయ, అటవీ, రవాణా, పరిశ్రమలు, విద్యుత్, వాణిజ్య పన్నులు, స్టాంపులు–రిజిస్ట్రేషన్, ఎక్సైజ్ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల్లో 22,500 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ బదిలీల్లో టీచర్లు, వైద్యశాఖ సిబ్బందికి అవకాశం కల్పించలేదు. దీంతో జిల్లాలోని ప్రభుత్వ టీచర్లు 9162, వైద్యశాఖ సిబ్బంది 1156 మొత్తం 10,318 మందికి బదిలీల్లో మినహాయింపు కల్పించారు. మిగిలిన 12,182 మంది ఉద్యోగులను, గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న 9,346 మంది మొత్తం జిల్లాలో 21,528 మంది ఉద్యోగులు బదిలీ కానున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మణెయ్య మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: విద్యుత్ షాక్‌తో మృతి చెందిన మణెయ్య కుటుంబాన్ని, హత్యా యత్నానికి గురై తీవ్ర గాయాల పాలైన వైఎస్సార్‌సీపీ నాయకుడు బొజ్జారెడ్డి కుటుంబాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి కే.నారాయణస్వామి పరామర్శించారు. శనివారం ఆయన పాతగుంట, కేవీఎం అగ్రహారం గ్రామాల్లో పర్యటించారు. కేవీఎం అగ్రహారం గ్రామానికి చెందిన మణెయ్య (50) చెట్టులోని ఆకులు కత్తిరిస్తుండగా కరెంట్‌షాక్ తగిలి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నారాయణస్వామి గ్రామానికి వెళ్లి మణెయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేసి ధైర్యం చెప్పారు. అంతకుముందు పాతగుంటలో ఇటీవల ప్రత్యర్థి చేతిలో హత్యాయత్నానికి గురై తీవ్ర గాయాలతో తిరుపతిలో చికిత్స తీసుకుని ఇంటికి వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బొజ్జారెడ్డిని వారి ఇంటికెళ్లి పరామర్శించారు. అధైర్య పడకుండా ఉండాలని బొజ్జారెడ్డిని భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఉపాధ్యక్షుడు రామయ్య, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, సర్పంచ్‌లు గోవిందయ్య(బొమ్మయ్యపల్లె), భువనేశ్వరి(పాతగుంట), ఏఎంసీ డైరెక్టర్ గఫూర్, మాజీ సర్పంచ్ గోవిందన్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



బొలెరో ఢీకొనడంతో కింద పడిన బైక్

సదుం: బొలెరో వాహనం ఢీకొని ఇద్దరు గాయపడిన సంఘటన మండలంలో శనివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. సదుంకు చెందిన ఇర్ఫాన్, అక్బర్ ద్విచక్రవాహనంలో పీలేరుకు బయలుదేరారు. పాపిరెడ్డిగారిపల్లె క్రాస్ సమీపంలోని వంతెన వద్ద వీరి వాహనాన్ని ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో పీలేరు ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్‌షాక్‌తో బాలుడు మృతి



మృతి చెందిన దౌలత్ (ఫైల్)

పుంగనూరు: పట్టణంలోని కొత్తపేటలోని విశ్రాంత మిలిటరీ ఉద్యోగి రఫిక్ కుమారుడు దౌలత్ (14) శనివారం విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. శనివారం ఉదయం దౌలాత్ తన ఇంటిపైన పావురాలను పట్టుకునే ప్రయత్నంలో విద్యుత్‌షాక్ తగలింది. దీంతో బాలుడు అక్కడిక్కడే మృతి చెందాడు. ఆ ప్రాంతంలో విషాద ఛాయలు నిండుకున్నాయి. పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అరెస్టు



పోలీస్ స్టేషన్ ఆవరణలో మురుగేష్, శ్రీనుతో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు

కుప్పం: కుప్పం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మురుగేష్, ఆయన కుమారుడు శ్రీనివాసులను కుప్పం పోలీసులు శనివారం రాత్రి అక్రమంగా అరెస్టు చేశారు. మల్లానూరు పంచాయతీ సంబంధించి ట్రాక్టర్ చోరీ కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై మల్లానూరు గ్రామానికి చెందిన ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద వీరిపై కేసు నమోదు చేశారు. రెండు కేసుల్లో మండల కన్వీనర్ మురుగేష్, ఆయన కుమారుడు వన్నెకుల క్షత్రియ రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ భర్త శ్రీనివాసులును అక్రమంగా అరెస్టు చేశారు. గతంలో రాజీ కుదిరిన కేసులను సైతం మళ్లీ రీఓపెన్ చేసి ప్రణాళిక ప్రకారం మండల కన్వీనర్‌తో పాటు ఆయన కుమారున్ని అరెస్టు చేశారు.

కారు–ఆటో ఢీకొని..

బంగారుపాళెం: మండలంలోని కేజీ సత్రం వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం ఆటోను కారు ఢీకొని 10 మంది గాయపడ్డారు. యాదమరి నుంచి కేజీ సత్రం వస్తున్న ప్యాసింజర్ ఆటోను బెంగళూరు నుంచి చిత్తూరుకు వెళ్తున్న ఓ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వి.కోట మండలం నడమంత్రం గ్రామానికి చెందిన రాజేష్(50), సురేష్(32), చిన్నమ్మ(29), శివ(20)తో పాటు మరో ఆరుగురికి గాయాలయ్యాయి. ఎవరికీ ప్రాణాపాయం లేదు. ఘటనా స్థలికి చేరుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను ప్రథమ చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ద్రౌపదమ్మకు పట్టువస్త్రాల సమర్పణ



సారెతో వస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

- పుత్తూరులో మొక్కు చెల్లించుకున్న మాజీమంత్రి రోజా

పుత్తూరు: పట్టణంలోని ద్రౌపదీదేవి సమేత ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మాజీమంత్రి ఆర్కే రోజా శనివారం పట్టువస్త్రాలు సమర్పించారు. మహారథోత్సవం అనంతరం ఆమె స్వామి, అమ్మవార్లకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం అర్చకులు ఆలయ మర్యాదలు చేసి, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ ద్రౌపదమ్మ కృపతోనే గత 10 ఏళ్లుగా అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్నానని తెలిపారు. ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, కౌన్సిలర్ రాధ, వైఎస్సార్‌సీపీ నాయకులు లారీమోహన్, మనోహర్‌రెడ్డి, వెంకటేశులు, ఈశ్వరయ్యయాదవ్, ప్రసాద్, మునయ్య, మోహన్‌రెడ్డి, సుబ్రమణ్యం, ఏకాంబరం, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

ముసుగు దొంగ హల్‌చల్

- పలమనేరులో డోరు తెరిచి ఉన్న ఇంట్లో బంగారు, నగదు చోరీ
- అడ్డుకున్న గృహిణిపై రాడ్డుతో దాడి
- పరారైన నిందితుడు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శరణ్య

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని గంటావూరు కాలనీలో ముసుగుదొంగ శనివారం హల్‌చల్ చేశాడు. తలుపు తెరిచి ఉన్న ఇంట్లోకి చొరబడి బీరువాలోని ఏడు గ్రాముల బంగారునగ, రూ.50 వేల నగదును చోరీచేశాడు. అడ్డువచ్చిన మహిళను ఇనుపరాడ్‌తో కొట్టి అక్కడినుంచి ఉడాయించిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గంటావూరు కాలనీలో శరణ్య(35) కుటుంబం కాపురం ఉంటోంది. ఆమె ఇంటి మిద్దెపై ఆరేసిన దుస్తులను తీసుకురావడానికి వెళ్లగా, ఇంటి తలుపు తెరిచి ఉండడంతో ముఖానికి ముసుగు ధరించిన వ్యక్తి లోపలికి ప్రవేశించాడు. బీరువాలో దాచిన నగను, నగదును ఎత్తుకెళ్తుండగా, మిద్దెపై నుంచి కిందకు వచ్చిన శరణ్య అతన్ని వారించే ప్రయత్నం చేసింది. దీంతో ఆ ముసుగుదొంగ తన వద్ద ఉన్న ఇనుపరాడ్డుతో ఆమె తలపై కొట్టి పారిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చి ఆమెను స్థానిక ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు విచారిస్తున్నారు.

ఇటీవల ఇదే తరహాలో చోరీ..

ఇటీవల పలమనేరు మండలంలోని నడిమిదొడ్డిపల్లిలో ఓ మహిళ ఇంటి ముందు పశువులకు గ్రాసం కోస్తుండగా గుర్తు తెలియని ముసుగు ధరించిన వ్యక్తి ఇంట్లోకి వెళ్లి బీరువాలోని బంగారు, నగదును చోరీచేశాడు. ఇంట్లో నుంచి వస్తుండగా తలుపు తెరిచి ఉండడాన్ని గమనించి అక్కడే ఉన్న మహిళను నీరు కావాలని అడగడంతో ఆమె లోపలకు వెళ్లి తెచ్చేలోపు ఉడాయించాడు. ఈ రెండు ఘటనలు ఒకటే తరహాలో జరగడం గమనార్హం.

హుండీ కానుకల లెక్కింపు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయ హుండీ కానులకను శనివారం లెక్కించారు. ఇందులో హుండీ ద్వారా రూ.1,44,80,588లను భక్తులు కానుక రూపంలో సమర్పించుకున్నారు. అలాగే బంగారం 17 గ్రాములు, వెండి 810 గ్రాములు ఉంది. గోసంరక్షణ హుండీలోని కానుకలను లెక్కించగా రూ.16,741, నిత్యాన్నదానం హుండీ నుంచి రూ.32,097, విదేశీ కరెన్సీ యూఎస్‌ఏవీ 645 డాల్లర్లు, యూఏఈ 95 దిర్హామ్, మలేషియా 1 రింగిట్, ఆస్ట్రేలియా 50 డాలర్లు, సింగపూర్ 10 డాలర్లు, 20 యూరోలు, ఇంగ్లాడ్ 5 పౌండ్స్ వచ్చినట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ వెంకటేశు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, పర్యవేక్షకులు కోదండపాణి, శ్రీధర్‌బాబు, మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

అన్న చేతిలో తమ్ముడి హతం



హత్యకు గురైన చెంగయ్య

పెద్దపంజాణి: అన్న చేతిలో తమ్ముడు దారుణ హత్యకు గురైన సంఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని మట్టిగానిపల్లికి చెందిన లేట్ లక్ష్మయ్య కుమారులు కే.వెంకటరమణ, చెంగయ్యకు ఇంటి జాగా విషయమై గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి అన్న వెంకటరమణ తమ్ముడు చెంగయ్య(57)పై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన చెంగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల సమాచారంతో గంగవరం రూరల్ సీఐ మురళీమోహన్, పెద్దపంజాణి ఇన్‌చార్జ్ ఎస్ఐ సహదేవి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జీతం తీసుకుంటారు.. బాధ్యతగా పనిచేయలేరా?

- అతి చేస్తే సస్పెండ్ చేస్తా
- ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు ఫైర్



మాట్లాడుతున్న ఎస్‌ఈ సురేంద్రనాయుడు

చిత్తూరు కార్పొరేషన్: ప్రతినెల ఠంఛనుగా జీతాలు తీసుకుంటున్నారు.. ఫిర్యాదులు లేకుండా పనిచేయలేరా ? అని ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు అని ప్రశ్నించారు. శనివారం చిత్తూరు రూరల్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ''మీరు క్షేత్రస్థాయిలో పనిచేస్తే ఫిర్యాదులు రావన్నారు. పోనీ వచ్చిన ఫిర్యాదులను అయినా సక్రమంగా పరిష్కారిస్తారా ? అంటే అది లేదు.. నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తే సస్పెండ్ చేస్తా'' అని హెచ్చరించారు. ఇదివరకే పలు కారణాలతో ఉమ్మడి జిల్లాలో నలుగురు ఏఈలను విధుల నుంచి పక్కన పెట్టిన విషయం గుర్తు చేశారు. ట్రిప్పింగ్ సమస్యలను ఎందుకు తగ్గించలేకపోతున్నారని ప్రశ్నించారు. డివిజన్‌లో మొండి బకాయిలు రూ.1.58 కోట్లు ఉన్నట్లు తెలుసుకున్నారు. ఆధార్ నంబర్ ద్వారా కనెక్టడ్ సర్వీసుల వివరాలు తెలుస్తాయా అనే అంశాలపై మాట్లాడారు. యూపీఐ యాప్స్ ద్వారా కరెంటు బిల్లు కట్టడానికి ఆర్‌బీఐ అనుమతులు ఇచ్చిందని, త్వరలో ఇక పాత విధానంలోనే బిల్లులు కట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఈఈలు హరి, మునిచంద్ర, డీఈ కొండయ్య, ఏఏఓ గీత, ఏఈ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఏనుగుల దాడులు



ఏనుగులు ధ్వంసం చేసిన టమాట పంట

పెద్దపంజాణి: మండలంలో గత కొంతకాలంగా ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. పెద్దకాప్పల్లి పంచాయతీ పరిధిలోని అటవీ సరిహద్దు గ్రామాలైన ఆకులవారిపల్లి, జిట్టంవారిపల్లి, గౌరీనగర్, పెద్దకాప్పల్లి, ముదిరెడ్డిపల్లి, పెనుగొలకల, తిప్పిరెడ్డిపల్లి, కొత్తబూరగపల్లి రైతులకు చెందిన పంటలను నాశనం చేస్తున్నాయి. శుక్రవారం రాత్రి పుంగనూరు రేంజ్ పేటూరు ఫారెస్టు బీటు నుంచి వచ్చిన ఏనుగులు కొత్తబూరగపల్లి గ్రామానికి చెందిన రవికుమార్ టమాట పంటను ధ్వంసం చేశాయి. అదే గ్రామానికి చెందిన సుబ్రమణ్యం వరి మడిని తొక్కి నాశనం చేశాయి. మునిరామిరెడ్డికి చెందిన మామిడి తోట ఫెన్సింగ్‌కు ఏర్పాటు చేసిన కూసాలను విరిచేశాయి. వేరుశనగ పంటపై విరుచుకుపడ్డాయి. శనివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటలకు జరిగిన నష్టాన్ని చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ దాడుల్లో సుమారు భారీగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోయారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులు పంటలపైకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.